క్లుప్తంగా

సిర్లి పోతన్న జాతర

బలిజిపేట: నారాయణపురంలో సిర్లి పోతన్న జాతరను శనివారం ఘనంగా నిర్వహించారు. బత్తుల పుల్లయ్య పూజారి వేషంలో గ్రామంలో పురవీధులలో ఊరేగించి భక్తులు మెక్కులను తీర్చుకున్నారు. ఊరేగింపులో యువకులు, భక్తులు పాల్గొని మేళతాళాలతో సందడి చేశారు. ఉదయం నుండి పోతన్న గుడి వద్ద పూజలు జరిపారు. కార్యక్రమంలో నారాయణపురంతో పాటు బలిజిపేట, వెంగాపురం, పలగర తదితర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతులు



మరమ్మతులు పరిశీలిస్తున్న ఏఈ

సీతానగరం: మండలంలోని విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించడంతో పాటు సబ్‌స్టేషన్‌లలో ఓవర్ హాలింగ్ పనులు చేయడం జరుగుతోందని ఏపీఈపీ డీసీఎల్ ఏఈ సోమేశ్వరరావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని బూర్జ, అప్పయ్యపేట గ్రామాల్లో సబ్‌స్టేషన్‌లు ఉన్నాయని, ఈ ప్రాంతంలో సింహభాగం భూముల్లో పామాయిల్ తోటలు పెరగడం వలన శిథిలమైన విద్యుత్ స్తంభాలు విరిగి పోవడంతో తరచూ విద్యుత్ అంతరాయం తరచూ ఏర్పడడంతో ఉన్నతాధికారుల సూచనల మేరకు అప్పయ్యపేట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టడం జరిగిందన్నారు.

కవితల పోటీల్లో ఉపాధ్యాయుడి ప్రతిభ

పార్వతీపురం: కవితల పోటీల్లో పల్ల రోహిణికుమార్ తన ప్రతిభను కనబరిచారు. వసుంధర విజ్ఞాన వికాస్ మండలి 30వ వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో 'మట్టి పరిమళాల సేద్యం' అనే కవితను ఎంపిక చేశారని ఆయన శనివారం తెలిపారు. విజేతలకు మార్చి 12న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమంలో బహుమతులను ప్రధానం చేస్తారని తెలిపారు. ఈయన పార్వతీపురం సమీపంలో గల నవిరి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా పని చేస్తున్నారు. ఈయనను పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

ఎరువుల దుకాణం తనిఖీ



వంతరాంలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

బలిజిపేట: మండలంలోని వంతరాంలో ఉన్న శ్రీ అయ్యప్ప జనరల్ స్టోర్స్ ఫెర్టిలైజర్ ఎరువుల దుకాణాన్ని విజిలెన్స్ అధికారి సింహాచలం, సిబ్బంది ఆకస్మికంగా శనివారం పరిశీలించారు. శ్రీకాకుళం ప్రాంతీయ నిఘా అమలు అధికారి ఎ.సురేష్‌బాబు ఆదేశాల మేర దాడులు నిర్వహించినట్టు అధికారులు తెలిపారు. షాపులో ఎరువుల నిల్వల్లో వ్యత్యాసాలు ఉన్నట్టు గుర్తించారు. రూ.10,72,236 స్టాకును సీజ్ చేశారు. షాపు యజమానిపై 6-ఎ కేసు నమోదు చేసినట్టు తెలిపారు. చర్యలకు సిఫార్సు చేయడం జరుగుతుందన్నారు. ఏఓ శ్రావణ్, సిబ్బంది పాల్గొన్నారు.

మెహర్ బాబా జయంతి

పార్వతీపురం టౌన్: అవతార్ మెహర్‌బాబా 129వ జయంతి ఉత్సవాలు స్థానిక బాబా సెంటరులో శనివారం నిర్వహించారు. ప్రత్యేక కార్యక్రమాలతో పాటూ నగర సంకీర్తన, జెండా ఆవిష్కరణ, భజనలు, కీర్తనలు, ప్రసంగాలు చేశారు. అనంతరం అన్న సంతర్పణ కార్యక్రమాలు, నిరాశ్రయుల వసతిగృహంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో అధ్యక్షుడు మంచుపల్లి శ్రీరాములు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

దట్టంగా పొగమంచు



వైకేఎం పరిసరాలలో కురుస్తున్న పొగ మంచు

పార్వతీపురం: కొద్ది రోజులుగా పొగమంచు కురుస్తుండడంతో రాకపోకలు చేసేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పార్వతీపురం సమీపంలోని వైకేఎం కాలనీ, ఆర్టీసీ కూడలి తదితర ప్రాంతాలలో శనివారం ఉదయం 7 గంటల వరకు దట్టమైన పొగమంచు కురిసింది. ఈ కారణంగా పక్కన వున్నవారు కనిపించని పరిస్థితి నెలకొంది. అలాగే రోడ్లపై రాకపోకలు చేసేందుకు వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కురుస్తున్న మంచుకు జీడిమామిడికి తీవ్ర నష్టం తప్పదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలి

● ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం టౌన్:



ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

రాష్ట్ర శాసన మండలి పట్టభద్రుల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా శనివారం పార్వతీపురం పురపాలక సంఘం బెలగాం ప్రాంతం 17వ వార్డు బంగారమ్మ కాలనీలో స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పట్టభద్రులు ఉన్న ప్రతి ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించిన సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా తమ ప్రాధాన్యత ఓటు వేసి తప్పక గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, ఫ్లోర్ మంత్రి రవికుమార్, స్థానిక వార్డు ఇన్‌చార్జి గొల్లు పద్మావతి, ఏఎంసీ వైస్ చైర్మన్ వానపల్లి శంకర్రావు, కౌన్సిలర్ సభ్యులు సంఘం రెడ్డి లక్ష్మీపార్వతి, రణభేరి చిన్నంనాయుడు, ఎస్.లావణ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు సచివాలయం కన్వీనర్లు తవిటి నాయుడు, ఆర్‌వీఎస్ కుమార్, ఏఎస్ సందీప్ కుమార్, బి.ఆదినారాయణ, గుంట్రెడ్డి దామోదరరావు, పద్మావతి, కార్యకర్తలు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యం..

బలిజిపేట: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా అందరం కృషి చేయాలని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. బలిజిపేటలో పార్టీ కార్యాలయం వద్ద ఎమ్మెల్సీ ఎన్నికలపై నాయకులకు శనివారం దిశ, నిర్దేశం చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మురళీకృష్ణ, జెడ్పీటీసీ రవికుమార్, మండల ఉపాధ్యక్షుడు సాయిరాం, మండల కన్వీనర్ల అధ్యక్షుడు శ్రీరాముల నాయుడు, సర్పంచ్‌లు కె.మోహనరావు, సుందరరావు, ఎంపీటీసీ రాజమోహననాయుడు, జగన్, కె.వెంకటరమణ, శ్రీనివాసరావు, టి.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం



విద్యా బోధనలను పరిశీలిస్తున్న డీఈఓ రమణ

సీతానగరం: జిల్లాలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టికాహారంతో ఆహారంతో పాటు నాణ్యమైన విద్యనందించడానికి ఉపాధ్యాయులు ఎస్ఎంసీ కమిటీలు కృషి చేయాలని డీఈఓ ఎస్‌డీవీ రమణ కోరారు. మండలంలోని అంటిపేట, లచ్చయ్యపేట ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులు చేస్తున్న విద్యాబోధనలు, మధ్యాహ్న భోజన పథకం అమలు రికార్డులను, వంటలను శనివారం పరిశీలించారు. ఈ మేరకు ఆయన అంటిపేటలో మాట్లాడుతూ విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించడానికి అవసరమైన ఆహారం అందించి, ప్రభుత్వం ప్రవేశపెట్టిన మెనూను అమలు చేయాలని, మారుతున్న విద్యా బోధనలకు అనుగుణంగా ఉపాధ్యాయులు విద్యా బోధనలు చేయాలని అనంతరం పాఠశాల పరిసరాలను, విద్యార్థులకు కల్పిస్తున్న మంచినీరు సౌకర్యంపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంఈఓ జి.సూరాదేముడు ఎస్ఎంసీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జీవాలకు పీపీఆర్ వ్యాక్సిన్లు



ఏగోటివలసలో పీపీఆర్ వ్యాక్సిన్ వేస్తున్న పశువైద్యులు

సీతానగరం: ప్రభుత్వం ఉచితంగా గొర్రెలు, మేకల ఆరోగ్య పరిరక్షణకు సమకూర్చిన పీపీఆర్ వ్యాక్సిన్ నిర్దేశించిన గడువులోగా(3 రోజులు) పూర్తి చేయాలని ఆ శాఖ ఏడీ సీహెచ్ దీనకుమార్ అన్నారు. పశుసంవర్ధక శాఖ పరిధిలో ఉన్న గ్రామాల్లో గొర్రెలు, మేకలకు పశుసంవర్ధక శాఖ అధికారులు, సిబ్బంది వేస్తున్న పీపీఆర్ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు మండలాల్లో 55,492 గొర్రెలు మేకలున్నాయి తెలియజేశారు. సీతానగరం మండలంలోని పశువైద్యాధికారి ఎస్.రామారావు పర్యవేక్షణలో 22,618 గొర్రెలు మేకలున్నాయని ఇప్పటి వరకూ 17,492 గొర్రెలు మేకలకు పీపీఆర్ వ్యాక్సిన్ వేయడం జరిగిందన్నారు. బలిజిపేట మండలంలోని 33,013 గొర్రెలు మేకలున్నాయని మండల పశువైద్యాధికారి జి.గణేష్ పర్యవేక్షణలో ఇంతవరకూ 18.200 గొర్రెలు మేకలకు ఉచితంగా వ్యాక్సిన్స్ వేసినట్టు చెప్పారు. మార్చి 1 నుండి పశువులకు వ్యాధి నిరోధక టీకాల వేయనున్నట్టు డాక్టర్ సీహెచ్ దీనకుమార్ అన్నారు. కార్యక్రమంలో రెండు మండలాల పశు వైద్యులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు పునరావాసం కల్పించాలి



కలెక్టర్ నిశాంత్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎంపీపీ రామారావు

పార్వతీపురం: తోటపల్లి ప్రాజెక్టు నిర్వాసితులకు పునరావాసం కల్పించాలని కోరుతూ గరుగుబిల్లి మండల ఎంపీపీ ఉరిటి రామారావు, కలెక్టర్ నిశాంత్‌కుమార్‌కు శనివారం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలోని సుంకి, నందివానివలస గ్రామాలు తోటపల్లి ప్రాజెక్టులో నిర్వాసితులుగా ప్రభుత్వం గుర్తించిందని, ఇంతవరకు ఆయా గ్రామాలకు పునరావాసం కల్పించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారని పేర్కొన్నారు. గొట్టివలస గ్రామంలోని కొండ ప్రాంతంలో సాగు చేసుకొన్న భూములకు రైతులకు పట్టాలను మంజూరు చేయాలని కోరారు. ఆయనతో పాటు వి.కుర్మినాయుడు, ఉరిటి యాదవ్ తదితరులున్నారు. సమస్యలపై కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

వాహనాల వేలం రేపు

సీతానగరం: మండలంలోని వివిధ ప్రాంతాల్లో అక్రమంగా మద్యం సరుకు తరలిస్తూ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడి సీజ్ చేసిన వాహనాలను ఈ నెల 27న పోలీస్‌స్టేషన్‌లో వేలం వేయనున్నట్టు ఎస్ఐ కె.నీలకంఠం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్సైజ్ కేసులలో సీజ్ చేయబడిన సీడీ డీలక్స్ మోటార్ సైకిల్ 1, హీరో హోండా స్ప్లెండర్ మోటార్ సైకిళ్లు 2, బాక్సర్ సీటీ డీలక్స్ మోటార్ సైకిల్ 1, టీవీఎస్ ఎక్స్‌ఎల్ 3, హోండా యాక్టివ్, హీరో హోండా మోటార్ సైకిల్1, బజాజ్ ఆటో, హీరో హోండా ఫ్యాషన్, హోండా డీఏఓ వాహనాలను వేలం వేయనున్నట్టు పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం వాటి యజమానులు ఇప్పటివరకు విడిపించుకోనందున ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిబంధనలకు లోబడి సీతానగరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో సంబంధిత అధికారుల సమక్షంలో వేలం వేస్తామని, ఆసక్తి గల వారు వేలం పాటలో పాల్గొనవచ్చని తెలిపారు.

వాహనాల వేలం

సాలూరు: వివిధ సారా కేసులలో సీజ్ చేసిన వాహనాలకు శనివారం నిర్వహించిన వేలం పాటలో వేలం వేసినట్టు రూరల్ ఎస్ఐ ప్రయోగమూర్తి తెలిపారు. 23 వాహనాలకు వేలం పాట నిర్వహించగా రెండు ఆటోలు, ఆరు ద్విచక్ర వాహనాలు వేలం పాట పాడారని పేర్కొన్నారు. వీటిని రూ.3,75,830లకు విక్రయించినట్లు తెలిపారు.

ప్రతీ వాహనదారుడు ట్యాక్స్ చెల్లించాలి

మక్కువ: ప్రతీ వాహనదారుడు ట్యాక్స్ చెల్లించాలని సాలూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాదు కోరారు. మండల కేంద్రంలో శనివారం వాహన తనిఖీలను ఆయన నిర్వహించారు. వాహనాలకు సంబంధించి పత్రాలను, డ్రైవింగ్ లైసెన్స్‌ను ఆయన పరిశీలించారు. వాహనాలకు సంబంధించి ట్యాక్స్ చెల్లించని, వాహనదారులు వెంటనే ట్యాక్స్ చెల్లించాలని లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

తాగునీటి సమస్యల పరిష్కారానికి కంట్రోల్‌రూం

పార్వతీపురం: గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యల పరిష్కారానికి జిల్లా గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇంజినీరింగ్ అధికారి కార్యాలయంలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ.ప్రభాకరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 1నుండి ఉదయం 6గంటల నుండి రాత్రి 8 గంటల వరకు కంట్రోల్ రూం పని చేస్తుందన్నారు. వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య తలెత్తితే వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. తాగునీటి సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించడానికి సిబ్బందిని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తాగునీటి సమస్యలు, అతిసార తదితర అంశాలను కంట్రోల్ రూంకు తెలియజేయవచ్చునన్నారు. కంట్రోల్ రూంలో 9618477479, 8500895315, 9493822074 ఫోన్ నంబర్లు అందుబాటులో ఉంటాయన్నారు.

డీఎంహెచ్ఓ సందర్శన



బాలింతల ఎంసీపీ కార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ జగన్నాథరావు

వీరఘట్టం: పట్టణంలోని కూరాకుల వీధిలో ఉన్న హెల్త్ సెంటర్‌ను డీఎంఅండ్‌హెచ్ఓ బగాది జగన్నాథరావు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడి రికార్డులు, మందుల నిల్వలు పరిశీలించి, అక్కడికి వచ్చే వారికి అందిస్తున్న వైద్యసేవలపై ఆరాతీశారు. రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని సిబ్బందికి సూచించారు. క్రమం తప్పకుండా వారు ఆస్పత్రిని సందర్శించి, మందులు తీసుకునేలా చూడాలన్నారు. అనంతరం బాలింతల ఇంటికి వెళ్లి, వారి ఎంసీపీ(మంత్లీ చెకప్) కార్డులను పరిశీలించి, పలు సూచనలు చేశారు. రోజువారీ ఆహారంలో పౌష్టికాహారం ఉండేలా జాగ్రత్త వహించాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యురాలు ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

ఓవర్ లోడ్ వాహనాలపై చర్యలు తప్పవు



వాహనచోదకులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐలు సీతారాం, పాపారావు

పార్వతీపురం టౌన్: ఓవర్ లోడ్ వాహనాలపై చర్యలు తప్పవని, రహదారి భద్రతా నియమాలను ప్రతీ ఒక్కరూ పాటించాలని ట్రాఫిక్ ఎస్ఐలు, సీతారాం, పాపారావు అన్నారు. పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద నో యాక్సిడెంట్ డే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా వాహన చోదకులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారిపై రోడ్డు భద్రతా, రక్షణ, అతి వేగం వంటి విషయాలపై సంకేత బోర్డులతో అవగాహన కల్పించారు. రహదారిపై ద్విచక్ర వాహనాలు నడుపుతున్న వారు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడపరాదని ఎక్కువ స్పీడ్‌తో వెళ్లరాదని, తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. ఆటో డ్రైవర్‌లకు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలని సూచించారు. వాహనాలు నడిపేటప్పుడు ధ్రువపత్రాలు వెంట ఉంచాలన్నారు. ఓవర్ లోడ్‌తో వాహనాలు నడవరాదని హెచ్చరించారు. సరుకు రవాణా వాహనాలలో ప్రజా రవాణా చేసిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజారావు సిబ్బంది కిషోర్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

సీతంరాజును గెలిపించండి : జమ్మాన



ఓటు అభ్యర్థిస్తున్న ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్

పార్వతీపురం టౌన్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ కోరారు. పట్టణంలోని న్యాయవాదుల బార్ అసోసియేషన్ సభ్యుల ఇంటింటి ప్రచారాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతంరాజు సుధాకర్ అభ్యర్థిత్వాన్ని బలపరచాలన్నారు. విద్యావంతులు యువకులు ఉత్తరాంధ్ర జిల్లాల ఎమ్మెల్సీగా నామినేషన్ వేసిన సీతంరాజు సుధాకర్‌ని రాబోయే ఎన్నికలలో అత్యధిక మెజారిటీతో గెలిపించే విధంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, గ్రాడ్యుయేట్ ఓటర్లు పాల్గొన్నారు.

పైపులైన్ ఏర్పాటుకు పరిశీలన



పంప్‌హౌస్ వద్ద పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూస్ డీఈ

బలిజిపేట: చిలకలపల్లి పాకలవీధిలో ఉండే వాటర్‌ట్యాంక్‌కు తాగునీరు సరఫరా చేసేందుకు పైపులైను ఏర్పాటుకు ప్రతిపాదనలు చేసేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ హనుమంతరావు, ఏఈ వనజాక్షి పరిశీలన చేశారు. పాకలవీధిలో 20 కేఎల్ కెపాసిటీ కలిగిన వాటర్ ట్యాంకు నిర్మాణం జరిపారు. దానికి తగినంత నీరు లేకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. చిలకలపల్లి పంప్‌హౌస్ నుండి నేరుగా పైపులైను ఏర్పాటు చేసి ట్యాంకుకు నీరు ఎక్కించేందుకు పరిశీలన జరిపారు. 5లక్షల రూపాయల వరకు నిధులు వెచ్చించాల్సి ఉంటుందని డీఈ హనుమంతరావు తెలిపారు. దీనికి సంబంధించి పనులు నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సుందరావు, టి.ప్రసాదరావు పాల్గొన్నారు.

వీధి కుళాయిల నుంచి కలుషిత నీరు



వీధి కుళాయి నుంచి వస్తున్న కలుషిత నీరు

బలిజిపేట: నారాయణపురంలో వీధి కుళాయిల నుండి కలుషిత నీరు రావడంతో ప్రజలు తాగునీటికి అవస్థలు పడుతున్నారు. గ్రామంలో సువర్ణముఖీ నదిలో ఏర్పాటు చేసిన రక్షిత మంచినీటి పథకం నుండి తాగునీరు సరఫరా జరుగుతున్నది. ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు నుండి సరఫరా అవుతున్న నీరు గత 15రోజుల నుండి కలుషిత నీరు వస్తుందని దీనిని తాగలేకపోతున్నామని గ్రామస్తులు తెలిపారు. గ్రామం మొత్తానికి ఇదే నీరు సరఫరా అవుతుందని తెలిపారు. గ్రామంలో సుమారు వెయ్యి కుటుంబాల వారు ఉన్నారని వీరందరు ఇదే నీటిని తాగాల్సి వస్తుందని తెలిపారు. దీనిపై అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఏఈ వనజాక్షిని వివరణ కోరగా పంపింగ్ నుండి ఓహెచ్ఎస్ఆర్‌లోకి నీరు ఎక్కేటప్పుడు పొరపాటు జరిగి ఉంటుందని అందువల్ల గొట్టాలను, ట్యాంక్‌ను పరిశుభ్రం చేసి నీరు విడుదల చేయించాలని సిబ్బందికి సూచించామని తెలిపారు. మూడు రోజుల్లో మంచి నీరు సరఫరా అయ్యేలా చూస్తామని పేర్కొన్నారు.

సాదాసీదాగా కౌన్సిల్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి

పార్వతీపురం టౌన్: మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి అధ్యక్షతన శనివారం కౌన్సిల్ సమావేశం సాదాసీదాగా జరిగింది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా సాధారణ సమావేశం అజెండాలో ఉన్న ఒక్క అంశం ఆమోదంతో ముగిసింది. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు, వైస్ చైర్‌పర్సన్ కొండపల్లి రుక్మిణి, యిండుపూరు గుణేశ్వరరావు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

పోరాటంతోనే సహారా సమస్య పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

పార్వతీపురం: సహారా ఇండియా కంపెనీలో ఖాతాదారులకు చెల్లింపుల్లో తీవ్ర జాప్యం జరుగుతుండడంతో ఏజెంట్లు ఒత్తిళ్లకు గరవుతున్నారని ఈ నేపథ్యంలో ఫీల్డ్ వర్కర్సు అంతా కలిసికట్టుగా పోరాడితే సమస్యను పరిష్కరించుకోగలమని ఏపీ సహారా ఫీల్డ్ వర్కర్స్ యూనియన్ కమిటీ సభ్యులు కె.అప్పారావు(కాకినాడ బ్రాంచ్) అన్నారు. పార్వతీపురంలో ఏజెంట్లతో శనివారం ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహారా ఇండియాలో డిపాజిట్ చేసిన కస్టమర్లకు సకాలంలో తిరిగి నగదును ఇప్పించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. సెబీ, సహారా కంపెనీకి ఉన్న వివాదాన్ని త్వరితగతిన సమస్యను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాల్సి వుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సంఘాన్ని బలోపేతం చేసి ఖాతాదారులకు న్యాయం చేసేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో యూనియన్ నాయకులు అజయ్‌బాబు(రామచంద్రాపురం), సత్యనారాయణ (తాడేపల్లిగూడెం), ప్రభావతి (రాజమండ్రి)తో పాటు స్థానిక ఏజెంట్లు వి.శ్రీనివాసరావు, జీఎల్ నారాయణ, ఎ.శ్రీనుబాబుతోపాటు పలువురు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రంలో ఆకస్మిక తనిఖీలు



రోగుల సేవలపై ఆరాతీస్తున్న జిల్లా మలేరియా నివారణ అధికారి శ్యామ్‌కుమార్

కురుపాం: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని పార్వతీపురం మన్యం జిల్లా మలేరియా నివారణ అధికారి శ్యామ్‌కుమార్ శనివారం సందర్శించి, ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తొలుత అక్కడి రికార్డులు పరిశీలించి, రోగులకు అందిస్తున్న సేవల వివరాలపై సిబ్బందిని ఆరాతీశారు. ల్యాబ్, బ్లడ్‌బ్యాంకు గదులు, ఐసీటీసీ సేవలను వైద్యురాలు శోభారాణిని అడిగి తెలుసుకున్నారు. కేంద్రానికి వచ్చే రోగులను గౌరవించి, వారికి కావాల్సిన వైద్యసేవలను అందివ్వాలని ఆయన సూచించారు. అనంతరం కురుపాం, శివ్వన్నపేట హెల్త్ సబ్‌సెంటర్లను సందర్శించిన ఆయన అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్ఓ గంట వెంకటరమణ ఉన్నారు.

మంత్రి పరామర్శ

సాలూరు: ఇటీవల అరుణాచలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పట్టణానికి చెందిన వ్యాపారవేత్త మండవల్లి సోమేశ్వరరావు మృతి చెందడం బాధాకరమని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. పట్టణంలోని సోమేశ్వరరావు కుటుంబ సభ్యులను ఆయన శనివారం పరామర్శించారు. తన సానుభూతిని తెలిపారు.



సోమేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి పీడిక రాజన్నదొర